# మనీషి - మనీ = షి (?)

"ఫ్రెండ్స్........ అర్థంలేని ఆచారాలతోనూ.... .... .... .... వాటిలోని బలహీనతలతోనూ నానాటికీ కుళ్ళిపోతూ వున్న ఈ సాంఘిక వ్యవస్థనీ కట్టుబాట్లనూ ఛేదించుకొని ప్రగతిపథం వైపు అడుగు వేస్తున్న ఈ ఆదర్శ వివాహం ఈ కొత్తదంపతులకు సుఖ సంతోషాలను ప్రసాదిస్తుందని ఆశిస్తున్నాను."

హాలంతా చప్పట్లతో నిండింది.

రాజు వైపు గర్వంగా చూసింది శైలజ. ఆ కళ్ళలో అడ్మిరేషన్ ....ఆ క్షణం రాజు హీరోయే అయ్యాడు.

అలా చాలాసార్లు హీరో అయ్యాడు.

ఆ రోజు.... అందమైన సాయంత్రం.... .... సూర్య కళామందిర్ గ్రీన్ రూమ్‌లో శైలజ మర్యాదగా "గ్రీట్" చేస్తున్నప్పుడు అతడి కళ్ళల్లో కనబడిన హుందాతనం— మాటల్లో వినబడిన మంచితనం—

ఆపైన సరిగ్గా పది రోజుల తర్వాత- ఇంకో అందమైన సాయంత్రం, ఒంటరిగా బీచ్‌లో- ఆమె పెదవుల్ని సుతారంగా ముద్దు పెట్టుకుంటున్నప్పుడు- అతడి చేతుల్లో కనబడిన వణుకూ చేతుల్లో కనబడిన చురుకూ-

ఆ తర్వాత నాల్గు నెలలకి ఆమె తనని తండ్రిని చేయబోతోందని తెలిసినపుడు ఆ కళ్ళల్లో కనబడిన చెదరని నిశ్చలత్వం—

ఇవన్నీ చాలాసార్లు రాజుని శైలజ దృష్టిలో హీరోని చేసినయ్. ఆమె కళ్ళల్లో అడ్మిరేషన్ కనబడింది....అంటే దానికొ్కారణం వుంది.

ప్రేమించటం గొప్పదనం కాకపోవచ్చు. కాణీ కట్నం లేకుండా ప్రేమించిన అమ్మాయిని- అందులోనూ, ఆమెలో ఇంక "థ్రిల్ యేమీ లేదని" తెలిసిన తర్వాత కూడా.... పెళ్ళి చేసుకోవటానికి అతను యిష్ట పడ్డాడు అంటే....ఆమె కళ్ళల్లో ఆ మెచ్చుకోలు కనబడ కేం చేస్తుంది?

ఎలాగైనా శైలజ అదృష్టవంతురాలు!

ఆమె తండ్రి తల తాకట్టు పెట్టినా రాజు లాంటి వరుణ్ని కూతురికి కొని పెట్టి యివ్వలేడు.

ఈ కథలో హీరో రాజు అంటే నాకేమీ ఈర్ష్యాద్వేషం లాంటివి లేవు.

ప్రేమించడం తప్పు కాదు.... పెళ్ళి చేసుకోవాలనే ఉద్దేశము కలుగకపోయినా ప్రేమించేసేయటం మగవాడి జన్మహక్కు.

తెలుగు నవల్లో హీరోకి వుండవలసిన లక్షణాలు అన్నీ రాజుకి వున్నాయ్! కానీ రాజు హీరో అవటానికి కారణం శైలజ కాదు....రంగ నాథంగారి ఓటమి!

ఇంతలా మెరిసిపోతున్న అద్దం వెనుకవైపు నుంచి చూస్తే....

★ ★ ★ ★

కొద్దికొద్దిగా ఒరిగిపోతున్న వసారాలో చేతులు వెనుకగా కట్టుకొని రంగనాథం పచార్లు చేస్తున్నాడు. జీవితంలో పడిన కష్టాల్ని నుదుటి మీద గీతలు ప్రస్ఫుటపరుస్తూ వున్నాయ్! ఆ కళ్ళల్లో ప్రతిబింబిస్తున్నది ఆవేదన కాదు- నిస్పృహ కూడా.

ఆయన ఓడిపోయారు !

చిత్తుగా ఓడిపోయారు !!

రాజు వేసిన ఒక ఎత్తుతో ఆయన ఆట కట్టు అయింది. ఒక్కో అంతస్తూ నిర్మించుకొంటూ వచ్చిన ఆయన కలల భవంతి పునాదుల్తో సహా కూలిపోయింది. సమాధి అయిపోయిన ఆశల తాలూకు నీడలా ఆయన మిగిలేడు. ఆయనకు తోడుగా శారద !!

ఆ వసారాలోనే ఒక మూలగా కూర్చొని వుంది శారద. ఆమె కళ్ళల్లో ప్రశాంతత.

తుఫాను వచ్చి వెళ్ళిపోయిన తరువాత ప్రశాంతత....

అన్నయ్య పెళ్ళి తండ్రికి ఎంత పెద్ద దెబ్బో శారదకు తెలుసు. రాజులో తన ఆశల స్వరూపాన్ని చూసుకోవడం కోసం, ఉన్నదీ–సంపాదించినదీ అంతా కొడుకుమీదే పెట్టుబడి పెట్టేరు. అందులో ఆయన స్వార్థం లేదు. రాజు పెద్ద ఆఫీసరైతే ఎక్కువ కట్నం వస్తే ఆ కట్నంతో శారదకు ఇంకో ఆఫీసర్ని సంపాదించవచ్చు. ఉన్న ఒక్క కూతురూ - కొడుకూ తనకన్నా ఒక అంతస్తు పైకి చేరుకుంటారు.

లెక్కల మాష్టారు రంగనాథం లెక్క తప్పని సగం చేసిన తర్వాత తేలింది.

అసలు ఆయన ఒకలా చేసి వుండవలసింది. సంపాదించిందంతా కొడుకు మీదే 'ఇన్వెష్ట్' చేయకుండా కూతురి కోసం ముందే సగంతీసి ఉంచవలసింది. అలా చేసివుంటే రాజు చదువు మెట్రిక్యులేషన్‌తో ఆగిపోయి అతడో గుమాస్తా అయివుండేవాడు. శారదకు ఇంకో గుమాస్తా భర్త అయివుండేవాడు అప్పుడు రంగనాథానికి తన కోడలు "ఏం తెచ్చిందీ" అన్న ప్రశ్నే వుదయించేది కాదు.

కొడుకుని పెద్ద హోదాలో వుండగా చూసుకోవాలని అనుకోవడం, కూతుర్ని పెద్దింట్లో పడేయాలని అనుకోవటం అత్యాశకాదు. తండ్రిగా ఆయన చేసింది (శారద దృష్టిలోంచి చూడకపోతే) తప్పేం కాదు. కాని తప్పు చేసినవాడికే శిక్ష అని ఎక్కడా రూల్ లేదుగా.

ఏది ఏమయినా ఆయన ప్రస్తుతం అశక్తుడు. ఇంత అంత బరు వయిన బాధ్యతని ఆయన మోయలేడు.

ఒక ముహూర్తాన రంగనాథం- ఈ కథ నుంచీ - లోకం నుంచీ తప్పుకొన్నారు.

★ ★ ★ ★

ఇక మిగిలింది శారద.

ఆమెకు అర్థమయింది ఒక్కటే.

ప్రేమ ఈజ్ ఈక్వల్‌టు పెళ్ళి మైనస్ కట్నం ! !

ఎదురింటి రూమ్‌లో బి. ఎ. అయిదో సంవత్సరం చదివే సుబ్బా రావులో రాజు తాలూకు ఛాయలు వెతుక్కోవటానికి ట్రై చేసింది శారద. శైలజ తన మార్గదర్శి అనుకొంది.

ఆ రోజు అందమైన సాయంత్రం.... పెరటి గోడ దగ్గర శారదతో మొదటిసారి మాట్లాడిన రోజు.... సుబ్బారావు ఫ్రెండ్స్ అందరికీ పార్టీ ఇస్తానని ప్రామిస్ చేశాడు.

ఆ పైన సరిగ్గా మూడు రోజుల తర్వాత—

అదే స్థలంలో....

అర్ధరాత్రి పన్నెండు గంటలకి....

"నిన్ను ప్రేమిస్తున్నా శారదా" అని మత్తుగా అన్నాడు.

ఆ మరుసటిరోజే ఫ్రెండ్స్ అందరికీ పెద్ద పార్టీ ఇచ్చేడు సుబ్బా రావు.

ఆ పైన నాలుగు నెలలకి మళ్ళీ అదే స్థలంలో-అదే స్వరంతో.... "పెళ్ళి చేసుకుంటాననలేదుగా" అనేసి తన వళ్ళో తలపెట్టుకొని కొంచెం సేపైనా ఆమెని ఏడవనివ్వకుండా వడిగా లేచిపోయేడు.

తన విషయంలో పై థియరీ ఎందుకు తప్పిందో అర్థంకాలేదు శారదకు. ఆలోచించే టైమ్ కూడా లేదు. అర్జంట్‌గా ఆత్మహత్య చేసుకోవాలి. ఆమె బ్రతికివుంటే- ఇంకో ఆర్నెల్లలో మరో సుబ్బారావుని ఈ భూమ్మీదకు తేవడం తప్పని సరయ్యేది.

(ఆ తరువాత సుబ్బారావుకి ధర ఎంత పలికిందీ మనకనవసరం. రెండ్రోజుల క్రితమే అతడికి డాడీదగ్గర్నుంచి "ఆరెకరాల మాగాణి ఇచ్చే అమలాపురం సంబంధం చేసుకుంటావా? ఇరవై వేలూ, స్కూటరూ ఇచ్చే తెనాలిది చేసుకుంటావా?" అని ఉత్తరం వచ్చింది.)

★ ★ ★ ★

అంతే.

కథ అయిపోయింది.

"రాజు శైలజని ప్రేమించటం తప్పుకాదు" అనుకుంటే అంత వరకు సమర్థించుకోగలిగితే అతడు ఆ తరువాత ఆమెని పెళ్ళిచేసుకోకుండా ఉండి వుంటే తప్పకుండా విలన్ అయి వుండేవాడు.

శారద మామూలు అమ్మాయి. నవలలు చదివి- భావాలు పెంచుకున్న మామూలు అమ్మాయి. తనచుట్టూ జరుగుతున్న సంఘటనలలో తనను ఊహాస్మాతంగా చిత్రించుకొని దానిని వాస్తవం చేసుకోవాలనే ఆశతో, ఆశల భవంతుల కింద సమాధి అయిపోయిన సాధారణ స్త్రీ!

శైలజ ప్రేమని చూసి హర్షించి చప్పట్లుకొట్టిన లోకం- (ప్రేమకు సంబంధించినంతవరకూ) శారద ప్రేమని ఎందుకు హర్షించదో....?

శైలజ తండ్రి కూతురి పెళ్ళి ఇంత సులభంగా జరిగిపోయినందుకు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయి ఉండవచ్చు. కానీ అదేక్షణంలో శారద తండ్రి సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

ఎంత సమర్థించుకొందామన్నా ఇది సుఖాంతమని నాకు అనిపించటంలేదు.

ఇంకొక్క మాట....

ఒక దృశ్యం గురించి ఎక్కువగా చెప్పాలంటే కొద్దిగా వర్ణించి వదిలేయటం మంచిది. అప్పుడు ఎదుటి వ్యక్తి తన ఆలోచనలు సాగిన రీతిలో దాన్ని వూహించుకొంటాడు.

నిజానికి ఈ సమస్య తేలదు.

ఒక ఉమ్మడి కుటుంబంలో తండ్రి-కూతుళ్ళ పెళ్ళికోసం కొడుకుల మీద ఇన్వెస్టు చేసిన డబ్బుకోసం అధాడపడటం తప్పా?

"తప్పు" అని గుండెలమీద చేయివేసుకొని చెప్పగలగాలీ అంటే ఈ లోకంలో యింకా- యింకా- అందరూ రాజులే వుండాలి. మచ్చుకి ఒక సుబ్బారావు కూడా వుండకూడదు.

ఏమైనా నూతనత్వంవైపు పరుగులెత్తుతున్న యీ రధచక్రాలక్రింద యింకా కొంతమంది శారదలు బలికాక తప్పదు.

— ★ —